క్లుప్తంగా

నూతన అంబులెన్స్ ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: అత్యవసర సేవల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం భద్రాచలం ఐటీడీఏ ద్వారా వినాయకపురం పీహెచ్‌సీకు ప్రత్యేకంగా మంజూరైన అవ్వల్ అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పీహెచ్‌సీల సమస్యలపై వైద్యాధికారులు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించగా, పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాందాస్ నాయక్, డాక్టర్ కృష్ణ దీపక్ రెడ్డి, డాక్టర్ మధుశిక, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి వైద్యశిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ పంచాయతీలోని మదీన నగర్, ఎస్సీ కాలనీబస్తీలో శనివారం సింగరేణి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సీనియర్ వైద్యులు రవికుమార్ 72 మంది గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలందించి, మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రజలు కాచిచల్లార్చిన నీటిని సేవించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సిబ్బంది రూపశ్రీ, నాగసాయి, పవన్‌రాజు ఉన్నారు.

సెమీస్కిల్డ్ వర్కర్లుగా గుర్తించాలి

మణుగూరురూరల్: సింగరేణి వ్యాప్తంగా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లలో పని చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో జీఎం(సివిల్) సూర్యనారాయణకు శనివారం కొత్తగూడెం హెడ్డాఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షులు ఎ.మంగీలాల్ మాట్లాడుతూ.. యాజమాన్యం సానుకూలంగా స్పందించి వారికి సెమీ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల కాంట్రాక్ట్ కార్మికులకు మార్చి 31, 2024 వరకు సీఎంపీఎఫ్ లెక్కల వివరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా, బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అడ్వైజరీ కమిటీలోకి తీసుకోవాలి

దమ్మపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను తెలంగాణ ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటీలోకి తీసుకోవాలని ఆయిల్ పాం గ్రోయర్స్ సొసైటీ నాయకులు తుంబూరు మహేశ్వర రెడ్డి, పుల్లయ్య తాతారావులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు శనివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పామాయిల్ సాగు అశ్వారావుపేట నియోజకవర్గంలో ఉండగా, అప్పారావుపేట, అశ్వారావుపేట గ్రామాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాంతంలోని ఆయిల్‌పాం పంట సమస్యలపై అవగాహన ఉన్న ఎమ్మెల్యే జారేను, అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా తీసుకోవడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

సేవలు ప్రశంసనీయం

మణుగూరుటౌన్: వాసవీ క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో వివిధ సందర్భాల్లో పేదలకు సాయమందించే విషయంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని డాన్ టూ డస్క్ ఇన్‌చార్జ్ శ్రీనివాస గుప్తా, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బండారు నర్సింహారావు అన్నారు. శనివారం మండలంలోని సమితిసింగారం గాయత్రీదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన డాన్ టూ డస్క్ కార్యక్రమం ద్వారా రూ.50 వేలతో నిర్వహించే ఏడు కార్యక్రమాలకు వారు అతిథులుగా హాజరయ్యారు. తొలుత బుగ్గ, రేగులగండి గ్రామాలకు అవసరమైన వెయ్యి లీటర్ల నీటి ట్యాంకులను ఆయా గ్రామస్తులకు అందించారు. నిరుపేదకు వ్యాపారం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించేందుకు తోపుడుబండితో పాటు, చిన్నారులకు పుస్తకాలు, పేద మహిళలకు చీరలు, ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు రక్షణ కవచాలు, పది మంది అంధులకు చేతికర్రలు అందించారు. క్లబ్ ప్రతినిధులు, కేసా రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, శ్యాం, నాగరాజు, వసుంధర, శేషుబాబు, విశ్వనాథగుప్తా, దింటకుర్తి బ్రహ్మయ్య, దోసపాటి లక్ష్మి, పద్మజ, రమేశ్, ఉమ, సముద్రాల కృష్ణమూర్తి ఉన్నారు.

మానవ హక్కుల సమితి ఉపాధ్యక్షుడిగా మందాడి

మణుగూరురూరల్: జాతీయ వినియోగదారుల, మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మణుగూరుకు చెందిన మందాడి సంజీవరావును నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం సమితి వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు ఆర్‌కె జైన్, సౌత్ స్టేట్స్ రాష్ట్ర అధ్యక్షురాలు సహేరాభాను ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సేవా వారధి

- బుల్లి తెరపై మెరిసిన ముత్యం
- కార్మిక ఉద్యమాల నిర్మాణంలో నాజర్ పాత్ర
- సింగరేణి కార్మికుడి రాణింపు..

సండే స్పెషల్



సింగరేణి ప్రభావిత గ్రామస్తుల పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న నాజర్‌పాషా(ఫైల్)



'కనువిప్పు' లఘుచిత్రంలో కృష్ణుడి పాత్రలో నాజర్‌పాషా (ఫైల్)



వివిధ రంగాల్లో అందుకున్న అవార్డులతో..

మణుగూరుటౌన్: ఆ కార్మికుడికి వలస ఆదివాసీ గ్రామాలన్నా, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలన్నా అభిమానం. ప్రభావిత గ్రామాల యువకులైనా, కార్మికుల పిల్లలైనా ఉన్నత చదువులు చదివి ఖాళీగా ఉంటే ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్నది అతని ఆరాటం. ఒకవైపు సింగరేణి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూనే.. మరోవైపు నాటికలు, లఘుచిత్రాలు, దారావాహికల్లో నటిస్తున్నాడు. నటుడిగా, గాయకుడిగా, సేవకుడిగా, ఉత్తమ ఉద్యోగిగా, ఆదివాసీ, సింగరేణి ప్రభావిత గ్రామాల సమస్యల పరిష్కృత వారధిగా రాణిస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. అతనే మణుగూరుకు చెందిన ఎస్‌డి.నాజర్‌పాషా.

సింగరేణి మణుగూరు ఏరియాలో ఓసీ–2 ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నాజర్‌పాషా.. సేవా కార్యక్రమాలు నిర్వహించి అవార్డులు అందుకుంటున్నాడు. సినిమాపాత్రల్లో పరకాయ ప్రవేశం చేస్తున్నాడు. గేయాలు రచించడంలోనూ ఆయన మణుగూరు ఏరియాలో తనదైన ముద్ర వేసుకున్నారు.

సేవతో సమ్మిళితం.. ఉపాధికి ఊతం..

సరైన దుస్తులు లేని వారు, ఆహారం కోసం ఎదురు చూస్తున్నవారు ఎక్కడైనా తారసపడితే నాజర్‌పాషా వారికి దాతల సహకారంతో సాయం అందిస్తున్నాడు. నిరుపేదలు, వృద్ధులకు అండగా నిలుస్తున్నాడు. ఉద్యోగుల సహకారంతో సమీప వలస గ్రామాల పేదలకు, వృద్ధాశ్రమాలకు, ప్రభావిత గ్రామాలకు, అనాథ ఆశ్రమాలకు దశల వారీగా 200 క్వింటాళ్లకు పైగా సాయం అందించారు. ఇఫ్టూ కార్మిక సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నాజర్‌పాషా.. కొండాయిగూడెం, కొత్త కొమ్ముగూడెం, కొత్త మల్లేపల్లి, కొత్త పద్మగూడెం తదితర నిర్వాసిత గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారు. సునామి సమయంలో కృష్ణ జిల్లా చిన్నగొల్లపాలెంలో బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కరోనా వంటి సమయాల్లో నిత్యావసరాలు పంపిణీ చేశారు. సింగరేణి ఆస్తుల రక్షణ విభాగంలో కార్మికుల పిల్లలకు ఉపాధి చూపాలనే సంకల్పంతో 2003లో 25 మందితో 'విశ్వాస్ యూత్ వెల్ఫేర్'ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా.. అది నేడు 150 మంది కాంట్రాక్ట్ సెక్యూరిటీ కార్మికులతో ఏరియా ఆస్తుల పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తోంది. కాంట్రాక్ట్ కార్మికులకు జీవోల ప్రకారం వేతనాలు చెల్లించకపోతే వారి పక్షాన పోరాటాలు చేశారు. ఎంతోమంది కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పీఎఫ్, పే స్కేల్ వేతనం వంటి సమస్యలకు పరిష్కారం చూపారు.

అవార్డులతో గుర్తింపు..

2022 సంవత్సరంలో భద్రాచలంలో జరిగిన రాష్ట్రస్థాయి సమాజ సేవ బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో నాజర్‌పాషా ఉత్తమ సమాజ సేవకుడిగా వజ్జల ఫణిశర్మ నుంచి అవార్డును పొందారు. 2004 సింగరేణి కాలరీస్ మణుగూరు సాంస్కృతిక విభాగం ఉత్తమ నటుడు, 2005లో నటించిన 'శ్రామిక బంధం'లో ఉత్తమ నటనకు వై.విజయసారథి చేతులమీదుగా ఉత్తమ నటుడు, 2006లో జిల్లా స్థాయి పారిశ్రామిక నాటకోత్సవాల్లో 'ఆత్మఘోష'కు, 2012లో మట్టి మనిషి లఘుచిత్రం, 2014లో 'రక్షణోపదేశం'లో, 2023లో 'కనువిప్పు'లో ఉత్తమ నటుడుగా అవార్డులు పొందారు. 2008లో పర్యావరణ పరిరక్షణ నినాదాలతో ప్రథమ బహుమతి, లఘుచిత్రంలో ఉత్తమ రచనా, దర్శకత్వం అందుకున్నారు. దూరదర్శన్‌లో శ్రామికబంధం, పర్యావరణ పరిరక్ష, వృక్షోరక్షతి రక్షితః, విజయం మనదే..!, తెలుసుకుందాం రండితో పాటు యముడే మొగుడు వంటి కార్యక్రమాల్లో నటించి మెప్పించారు. తాజాగా 'మల్లేశం', మట్టిపూలు, లఘుచిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు.



ప్రజల చిరునవ్వే ఆకాంక్ష



సింగరేణి చెట్టు నీడలో కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. సమీప గ్రామాల ప్రజల మొముపై చెరగని చిరునవ్వు చూడాలన్నదే ఆకాంక్ష. సింగరేణి అధికారులు, సంస్థ సహకారంతో ఊపిరి ఉన్నంత వరకు నా వంతు కర్తవ్యంగా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలకు వారధిగా పనిచేస్తాను.

– నాజర్‌పాషా

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామంలో గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు అడ్డుకున్నారు. ఇసుక ర్యాంపు వద్ద సుమారు పది ట్రాక్టర్లను ఆదివాసీ నాయకులు అడ్డుకొని పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇసుక రవాణాపై ఆర్‌ఐ నాగమణిని వివరణ కోరగా ఆదివాసీ నాయకుల సమాచారం మేరకు చింతిర్యాల ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లే సరికి ట్రాక్టర్లు ఇసుక డంప్ చేసి వెళ్లిపోయాయని ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ తెలిపారు.



చింతిర్యాలలో ఆదివాసీ నాయకులు అడ్డుకున్న ఇసుక ట్రాక్టర్లు

నిబంధనలు పాటించకపోతే చర్యలు

బూర్గంపాడు: మోటార్ వెహికల్ చట్టం ప్రకారం స్కూల్ బస్‌లు కచ్చితంగా అన్ని నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కిషన్‌రావు హెచ్చరించారు. మోరంపల్లిబంజరలో శనివారం ఆయన స్కూల్ బస్‌లను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఫిట్‌నెస్ లేని బస్‌లపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. స్కూల్ బస్‌లు ఫిట్‌గా ఉండాలని, అదేవిధంగా ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించి అన్ని అనుమతులు ఉండాలన్నారు.వాహనాలకు సంబంధించిన టాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు సకాలంలో చెల్లించాలన్నారు. డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్స్‌లు ఉండాలని, నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా అన్ని వాహనాలకు సంబంధించి అనుమతి పత్రాలు తప్పనిసరిగా వెహికల్‌లో ఉంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా అనుమతులు లేనటువంటి వాహనాలు, ఫిట్‌లెస్ వాహనాలపై కేసులు నమోదు చేశారు.



మోరంపల్లిబంజరలో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ కిషన్‌రావు

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధుల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని లంకమల్లారం టీజీటీడబ్ల్యూఆర్‌జేసీలోని ప్రతీ గదిలో ఏసీఎం ఐదుశాతం దోమల మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధుల నివారణ కోసం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో, హాస్టళ్లలో దోమల మందును పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుమ, రవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఉండే ప్రతి ఇంటికి దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని బండారిగుంపు గ్రామంలో ఆయన చేతుల మీదుగా మొదటి విడత స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలో 10, గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలో 8 మలేరియా ప్రభావిత గ్రామాలను గుర్తించినట్లు చెప్పారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మండలంలోని బండారిగుంపు గ్రామంలో 75, నారంగుంపు గ్రామంలో 44 గృహాలకు దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేశారు. హెచ్‌ఈవో రాజు, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, సిబ్బంది కృష్ణవేణి, బేబి నాంచారీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై సమావేశం

చర్లరూరల్: నులి పురుగుల నివారణపై శనివారం చర్లలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా.. మొదటి సంవత్సరం నుంచి పంతొమ్మిది సంవత్సరాల వయస్సు వారికి ఏ విధంగా నులి పురుగుల మందు వాడాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సత్యనారాయణపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్యనయన వివరించారు. అనంతరం ప్రస్తుతం జ్వరాలు సోకుతున్న క్రమంలో వైద్యశాఖ వారికి మీ సహకారం కూడా అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ చైతన్య, హోమియోపతి వైద్యాధికారిణి పూజ, డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్స్ సౌమ్య, స్వరూప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి దివ్యనయన

రోడ్డుకు అనుమతులపై తీర్మానం

గుండాల: మండలంలోని ముత్తాపురం నుంచి పెద్దతోగు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ నుంచి అనుమతి ఇవ్వాలని పెద్దతోగు గ్రామస్తులు కోరారు. ముత్తాపురం గ్రామంలో శనివారం తహసీల్దార్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఎస్‌టీఎస్‌డీఎఫ్ కింద 6 కిలోమీల రోడ్డుకు నిధులు మంజూరి అయ్యాయి.

కాగా అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు సైతం పెద్దతోగు గ్రామస్తులు బహిష్కరించగా ప్రజాప్రతినిధులు, అధికారులు నచ్చజెప్పి ఓట్లు వేయించారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, డీఎఫ్‌ఓ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు తీర్మానం చేసి కాపీ అందజేయనున్నట్లు ఎంపీపీ ముక్తి సత్యం తెలిపారు. అయితే రోడ్డులేక గ్రామస్తుల ఇబ్బందులపై ఇటీవల సాక్షి దినపత్రికలో 'నరక ప్రయాణం'అనే కథనం ప్రచురితమైంది. దీంతో గ్రామస్తుల్లో కదలిక వచ్చి తీర్మాణానికి పూనుకున్నారు.

ఇసుక ర్యాంపు వద్ద కందకం



కందకాలు తవ్విస్తున్న ఆర్‌ఐ నాగమణి

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామంలో గోదావరిలో ఇసుక ర్యాంపు వద్ద శనివారం తహసీల్దార్ స్వర్ణలత ఆదేశాల మేరకు ఆర్‌ఐ నాగమణి ఆధ్వర్యంలో జేసీబీతో కందకం తవ్వించారు. ఈ నెల 14న జోరుగా ఇసుక రవాణా అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. చింతిర్యాల ఇసుక ర్యాంపు నుంచి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ అధికారులు కందకం తవ్వించారు. గతంలో రెవెన్యూ అధికారులు కందకాలు తవ్వించినా కందకాలు పూడ్చివేసి ఇసుక అక్రమ రవాణా సాగించారు. అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?



రోడ్డుపై కర్రలు పడిపోతున్నా వెళ్తున్న ట్రాక్టర్

బూర్గంపాడు: పరిమితికి మించిన బరువుతో వస్తున్న కర్రలోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీకి జామాయిల్, సుబాబుల్ కర్రలోడ్లతో వచ్చే వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సారపాక, లక్ష్మీపురంలోని ఐటీసీ ఉడ్‌యార్డుకు జామాయిల్, సుబాబుల్ కర్రలతో వచ్చే వాహనాలు పరిమితికి మించి ఎక్కువ బరువుతో వస్తు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గుడూరులో జామాయిల్ కర్రతో వస్తున్న లారీ బోల్తా పడి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు మృతిచెందారు. లక్ష్మీపురంలోని ఉడ్‌యార్డుకు కర్రలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ పైనుంచి కర్రలు రోడ్డుపై పడిపోయాయి. దీంతో పక్కన వచ్చే వాహనాదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎలాంటి రక్షణ లేకుండా పరిమితికి మించి కర్రతో వస్తున్న వాహనాలపై ఎంవీఐ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫేక్ కాల్స్ నమ్మి మోసపోవద్దు

అశ్వారావుపేటరూరల్: కొంతమంది కేటుగాళ్లు ఫేక్ కాల్స్ చేసి వ్యాపారులను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి వాటిని నమ్మి మోసపోవద్దని అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అశ్వారావుపేటలోని వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులమని ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని, లైసెన్స్‌లు లేకపోతే డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ కాల్స్ చేసే వారు అధికారులు కాదని, వాటిని నమ్మి భయందోళనకు గురి కావద్దన్నారు. నిబంధనల ప్రకారం వ్యాపారం చేసుకోవాలని, లైసెన్స్‌లు పొందాలని సీఐ సూచించారు. అలాగే ఫేక్ కాల్స్ చేసి, డబ్బులు డిమాండ్ చేస్తే తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

విద్యార్థులకు సన్మానం

చర్లరూరల్: ఉన్నత విద్యలో రాణిస్తున్న ఇద్దరు విద్యార్థులను చర్ల గురుదేవ్ విద్యాలయ యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 620 మార్కులు సాధించిన పి.ఆకాష్, జేఈఈ మెయిన్స్‌లో 4113 ర్యాంకు సాధించిన తోటమళ్ళ భవ్యశ్రీ లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌జీవీ గిరి ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్లు యంవి సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాస్‌లు, ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులను వారి తల్లితండ్రులను సీఐ రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు అభినందించారు.

దేవస్థానం ఉద్యోగి మృతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రమేష్‌బాబు (50) అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో శనివారం మృతి చెందాడు. పట్టణంలోని గొండేలవారి వీధిలో ఆయన నివాసం ఉంటున్నారు. రమేష్‌బాబు అంత్యక్రియలకు దేవస్థానం సిబ్బంది ఆర్థిక సాయం అందించారు.

అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపాడు: సీజనల్ వ్యాధుల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు గ్రామాలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, మండల వైద్యాధికారి లక్ష్మీసాహితి, ఏపీఎం నాగార్జున, సీడీపీఓ ప్రమీల, ఎంఈఓ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

కోటెమ్మ వార్షికోత్సవం

ములకలపల్లి: మండలపరిధిలోని నర్సాపురం శివారులోని కోటెమ్మతల్లి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనగా, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శనివారం లీగల్ కమ్ ప్రొబిషన్ అధికారిణి శివకుమారి చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం మహిళలకు కల్పిస్తున్న చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎమ్ రమాదేవి, అన్నమణి పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జారే..

దమ్మపేట: మండల పరిధిలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం మండలంలోని మందలపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌లతో పాటుగా నగదు బహుమతులను, ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. అదే గ్రామంలో ఎమ్మెల్యేకు విద్య నేర్పిన గురువు సదాశివమ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. మల్కారం గ్రామంలో ఇటీవలే కంటి ఆపరేషన్ చేయించుకున్న శ్రీరాముల ప్రసాద్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురంకు చెందిన ఇరు కుటుంబాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం పరామర్శించారు. పత్రికా విలేకరి, ఆర్‌ఎంపీ వైద్యుడు ఇనుకుర్తి రామాచారి బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, తొంటికి ఆపరేషన్ చేశారు. కాగా శనివారం రామాచారిని పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా షుగర్ వ్యాధితో బాధపడుతూ, శస్త్రచికిత్సలో కాలిని కోల్పోయిన సురభి శ్రీనివాస్‌ను పరామర్శించారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుధాకర్ నాగళ్ల వెంకటేశ్వరావు, గాడి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

భట్టి జన్మదిన వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వారి పార్టీ కార్యాలయాలు, ఆయా ప్రాంతాల సెంటర్లలో కేక్ కట్ చేశారు. మిఠాయిలను కార్యకర్తలకు పంచిపెట్టారు. పలు చోట్ల ఆస్పత్రిల్లో వ్యాధి బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: నాయకులు, కార్యకర్తల నడుమ కేక్‌కట్ చేస్తున్న పొదెం వీరయ్య



అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకుడు మొగళ్లపు చెన్నకేశవరావు



మణుగూరురూరల్: ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు